ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్సైలుగా వై చైతన్య, నెల్లి రాంబాబు లు ఆదివారం బాధ్యతల స్వీకరించారు. అల్లూరి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన వై చైతన్య, అనకాపల్లి జిల్లా ఎలమంచిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన నెల్లి రాంబాబు ఇద్దరు పదోన్నతి పై చింతపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి ఎస్సైలుగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,మండలంలోని ఎక్కడైనా నాటు సారా తయారీ, క్రయవిక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐలు

పాడేరు ఘాట్ రోడ్డులో ప్రమాదం

-లోయలోకి దూసుకుపోయిన వాహనం -18 మందికి గాయాలు-మాడుగుల, అనకాపల్లి ఆసుపత్రులకు తరలింపు

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న అగ్ని మాపక కేంద్రం సిబ్బంది

ప్రజాశక్తి- మాడుగుల: జీవనోపాధి కోసం పొట్ట చేత పట్టుకుని వలస పోతున్న కూలీలు ప్రయాణిస్తున్న బొలెరా వాహనం ప్రమాదానికి గురై 18 మంది కి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి క్షతగాత్రులు కొంతమంది అందించిన వివరాలివి.

ఒడిశా రాష్ట్రం కోరాపుట్టు జిల్లా కొత్తవలస, సిద్దల మామిడి, బొడ్డు గూడ, రాళ్లగెడ్డ గ్రామాలకు చెందిన 18 మంది కూలీలు తెలంగాణ రాష్ట్రంలో కూలీ పనులు చేసుకునేందుకు ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం బయలుదేరారు. ఆ బొలెరా వాహనంపై ఒరిస్సా నుంచి వస్తూ పాడేరు ఘాట్‌రోడ్డులో కోమాలమ్మ పనుకు ఏసుప్రభు మలుపు వద్ద వచ్చేసరికి అర్థరాత్రి సమయంలో బొలెరా వాహానానికి బ్రేకులు ఫెయిల్ కావడంతో లోయలోకి దూసుకుపోయింది. దీంతో గాయాలు పాలైన వారంతా పెద్దగా కేకలు వేయడంతో ద్విచక్ర వాహనదారులు గమనించి మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు., అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని లోయలో పడి ఉన్న క్షతగాత్రులను ఒడ్డుకు తీసుకుని వచ్చారు. అగ్నిమాపక వాహనంలోకి ఎక్కించి మాడుగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులకు ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉన్న మామిడి అప్పారావు, గుంట కాయేస్, డిప్ప తిరుపతి, కొర్ర రామ్, గుంత లైకోన్, అబినాయక్, కొంతల్, గుంట జంబోలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మిగిలిన గెమ్మెల శ్రీదేవి, సునీత, కొర్ర షుగంది, రాధా, షణ్ముఖుడు, రంజిత్, మనోజ్, పింగల్, లైమతి, లైక్ కొన్ మూర్తిలకు స్వల్ప గాయాలు కావడంతో మాడుగుల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ నారాయణరావుకు సంప్రదించగా పాడేరు పరిధిలో ప్రమాదం జరిగిందని, పాడేరు పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించామని తెలిపారు.

లక్ష ఎకరాల్లో కాఫీ సాగుకు లబ్ధిదారుల గుర్తింపు

-'ప్రజాశక్తి'తో ఐటిడిఎ కాఫీ విభాగం ఎడి జి.అప్పలనాయుడు

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా లక్ష ఎకరాల్లో కాఫీ సాగు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందిస్తున్నట్లు ఐటీడీఏ కాఫీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ (ఇన్చార్జి) జి అప్పలనాయుడు వెల్లడించారు. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో ఈ ఏడాది కాఫీ తోటల అభివృద్ధికి చేపడుతున్న కార్యాచరణ పై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే!

కాఫీ తోటల అబివృద్ధికి చేపడుతున్న చర్యలు?

ఈ ఏడాది ఏజెన్సీలోని పదివేల పాత కాఫీ తోటల పునరుద్ధరణకు కార్యాచరణ చేపట్టాం. ప్రతి రైతుకు ఒక ఎకరా చొప్పున పాత కాఫీ తోటను అభివృద్ధి చేసు కోవడానికి కాఫీ బోర్డు సబ్సిడీ ద్వారా 9 వేల రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఐటీడీఏ ద్వారా 450 కాఫీ మొక్కలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం పాత తోటల్లో దిగుబడి రాని మొక్కలను చనిపోయిన మొక్కలను తొలగించి కొత్త మొక్కలు నాటడం ఇంకా కాఫీ తోటలు దిగుబడి పెంచేందుకు అవసరమైన సెంట్రింగ్, హ్యాండ్లింగ్, బుష్ క్లియరెన్స్, ఫైర్ లైన్, బెంచ్ టెర్రాసింగ్, తదితర తోటల అభివృద్ధి పనులు రైతులతో నిర్వహించ నున్నాం.

కాఫీ ప్లాంటేషన్ పనుల వివరాలు

సుమారు పది వేల మంది కాఫీ రైతులకు పాత తోటల అభివృద్ధికి తోడ్పాటు అందించనున్నాం. పాత తోటల అభివృద్ధికి కాఫీ మొక్కల పంపిణీ ప్రారంభించాం. జూలై ఆగస్టు నెలలో ఈ కాఫీ ప్లాంటేషన్ పనులు జరగనున్నాయి.

లబ్ధిదారుల ఎంపిక ఏ విధంగా చేస్తున్నారు?

ఎంజిఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కొత్తగా లక్ష ఎకరాల్లో కాఫీ తోటల సాగు చేపట్టేందుకు చేసిన ప్రతిపాదనల మేరకు లబ్ధిదారుల ఎంపిక. గుర్తింపు ప్రారంభించాం. పాడేరు డివిజన్లోని కొయ్యూరుతో సహా 11 మండలాల్లో కూడా కొత్త కాఫీ తోటల సాగు కోసం ఐటిడిఏ కాఫీ లైజన్ వర్కర్ల ద్వారా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. కాఫీ సాగు కోసం ఇప్పటికే నీడ తోటలు ఉన్నవారికి అలాగే కొత్తగా నీడ తోటలు పెంచుకునే వారిని కూడా గుర్తిస్తున్నాం.

ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగి ఉన్న లబ్ధిదారులు తమ అటవీ భూముల్లో కాఫీ తోటలు సాగు చేసుకోవడానికి జాబ్ కార్డు ఆధార్ కార్డులను జత చేసి లైజన్ వర్కర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కాఫీ సాగు కోసం నీడ తోటల పెంచుకోవడానికి ఉపాధి పథకం ద్వారా మిశ్రమ పండ్ల తోటల పెంపకానికి కూడా ఈసారి ప్రభుత్వం అవకాశం ఇస్తుంది. 2026 జనవరి నుంచి ఈ కొత్త కాఫీ ప్రణాళిక అమలు కానుంది...

మిరియాలతో పెరిగిన ఆదాయం

ఏజెన్సీలో ఈ ఏడాది మిరియాలు అధిక దిగుబడితో రైతులకు ఆదాయం బాగా పెరిగింది మార్కెట్లో కూడా మంచి ధర లభించింది. కిలో మిరియాలకు 670 రూపాయల వరకు కొనుగోలు ధర రైతులకు లభించింది. దీంతో ఒక ఎకరా సాగు చేసే రైతులకు మూడు లక్షల నుంచి ఆదాయం అందుకోగా మూడు ఎకరాల తోటలు ఉన్న రైతులు సుమారు రెండున్నర టన్నుల వరకు మిరియాల దిగుబడి రావడంతో 15 లక్షల రూపాయల వరకు ఆదాయం అందుకున్నారు.

అనారోగ్యంతో ఎంఎల్‌హెచ్‌పి రమ్యశ్రీ మృతి

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెన్నవరం సచివాలయంలో ఎంఎల్‌హెచ్ పి(మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవిడర్)గా విధులు నిర్వర్తిస్తున్న గసాడి రమ్యశ్రీ (23) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. గత వారం రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, రెండు రోజుల క్రితం విశాఖపట్నంలోని చెస్ట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందింది. రెండు సంవత్సరాల క్రితం ఎంఎల్‌హెచ్ పి గా చేరి లోతుగెడ్డ జంక్షన్‌లో కుటుంబంతో జీవనం కొనసాగించేది. లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు లక్ష్మీకాంత్, శివప్రసాద్, హెచ్.వి. కృష్ణవేణి, సూపర్వైజర్ ప్రసాద్‌లు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. 5 తరగతి ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు 2 గంటల నుండి 4.30 వరకు పరీక్ష నిర్వహించారు.

అనధికార చేపల వేట!

- నిబంధనల అతిక్రమణపై పట్టని అధికారులు
- అడ్డగోలుగా దోచేస్తున్న వ్యక్తిపై చర్యలకు వెనకడుగు
- తక్షణ చర్యలు చేపట్టాలి : సిపిఎం నేత మట్ల వాణిశ్రీ

దేవీపట్నం గోదావరి బ్యాక్ వాటర్‌లో బోట్లలో సాగుతున్న చేపల అక్రమ వేట

ప్రజాశక్తి- దేవిపట్నం : దేవీపట్నం మండలంలో అనధికార చేపలవేట విచ్చలవిడిగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల.వాణిశ్రీ మండిపడ్డారు. మండలంలో అనధికారిక వ్యాపారాలు నిర్వహిస్తున్న బొచ్చు అప్పారావు అనే వ్యక్తిపై తక్షణమే విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివారం మధ్యాహ్నం సమయంలో నిషేధిత ప్రాంతమైన పూడిపల్లి, వీరవరం గ్రామాలలో పోలవరం బ్యాక్ వాటర్‌లో విచ్చలవిడిగా చేపల వేట నిర్వహిస్తున్నా అటువైపు కన్నెత్తి చూసేవారు లేకుండా పోయారని ఆరోపించారు. ఇంత బాహాటంగా చేపల వేట అక్రమంగా సాగిస్తున్నా అటుగా వచ్చేవారే లేరంటే సంబంధిత అధికారుల సహకారం ఎంతగా ఉందో ఇట్టే స్పష్టమౌతోందని ఆరోపించారు. దీనిపై పత్రికల్లో కథనాలతోపాటు ఆరోపణలు వినిపిస్తున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. నదిలోనిపెట్టి చిన్న చేపలు కూడా వదలకుండా జల్లెడ లాంటి వలలతో పట్టి, మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారని ఆరోపించారు. లక్షల్లో అక్రమ వ్యాపారం చేస్తున్నా సబ్‌కలెక్టర్, ఐటిడిఎ పిఒ, మత్స్యశాఖ, ఇతర సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేపల అక్రమ వేటపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు గిరిజన సొసైటీలకు చేపల వేటకు అనుమతులిచ్చి వారి జీవనోపాధికి చేయూతనివ్వాలని కోరారు. దేవీపట్నం ప్రాంతంలో చేపల అక్రమ వేటతోపాటు మద్యం, ఏజెన్సీలోని గనులు, ఇతర సహజవనరులను కొల్లగొట్టే అక్రమ వ్యాపారాల్లో ఉన్న వ్యక్తులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వాణిశ్రీ డిమాండ్ చేశారు.

పాలగెడ్డ రోడ్డు సాధనకు పోరాటం

సమావేశమైన వివిధ పార్టీల నేతలతో కూడిన సాధన కమిటీ

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ అంతరరాష్ట్ర రహదారి పునర్నిర్మాణానికి రాజకీయాలకు అతీతంగా పోరాడాలని పాలగెడ్డ రోడ్డు నిర్మాణ సాధన కమిటీ నిర్వహించింది. ఆదివారం దారకొండలో నిర్వహించిన సమావేశంలో వివిధ పంచాయతీల నాయకులు హాజరై పలు అంశాలపై చర్చించారు. గాలికొండ అమ్మవారు, దారకొండ, దుప్పిలివాడ, సీలేరు బొడ్డగండి గ్రామపంచాయతీ పరిధిలోని రహదారులు,అంతర్రాష్ట్ర రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని తీర్మానాలు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 16న ఆయా ఐదు పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు ప్రజలు రాజకీయాలకు అతీతంగా పాల్గొని, ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు అంతరరాష్ట్ర రహదారి నిర్మాణం పనులు జరిగేలా ఐక్యపోరాటం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో సమావేశానికి గాలికొండ ఎంపిటిసి అపరంగి బుజ్జిబాబు, కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, సీలేరు సర్పంచ్ పాంగి దుర్గో, దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ పీసా ఉపాధ్యక్షులు బత్తుల సిద్ధార్థ, మార్కు, దారకొండ సిపిఎం నాయకులు బాకూరి కోటేశ్వరరావు గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ బాబూరావు, తగ్గి రామకృష్ణ,నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు, గిరిజనులు

అంబేద్కర్ స్ఫూర్తితో.. రాజ్యాంగ రక్షణకు పోరాటం

ప్రజాశక్తి-అరకులోయ:అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగం రక్షణ, ఆదివాసీ హక్కులు, చట్టాల అమలుకై పోరాటం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ 134 వ జయంతి పురస్కరించుకుని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బస్కి పంచాయతీ గుగ్గడు గ్రామంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొద్దు బాలదేవ్, మండల నాయకులు బస్కి మాజీ ఎంపీటీసీ బురిడి దశరథ్ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు ఉండాలని దేశంలో సమగ్ర అభివృద్ధి జరగాలని అంబేద్కర్ ఆకాంక్షించారన్నారు..కేంద్రంలో బీజేపీ సర్కారు ప్రధానంగా ఆదివాసులకు అడవి నుండి గెంటివేస్తూ నూతన అటవీ సవరణ బిల్లును ఆమోదించిందన్నారు. అడవి మీద ఆదివాసులకు హక్కులు లేకుండా చేస్తున్నరని రాష్ట్ర ప్రభుత్వం వేలమంది ఆదివాసుల వందల ఎకరాలు జల సమాధి చేసేందుకు కార్పొరేట్ కంపెనీలకు సుమారు 8 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం అనుమతులు మంజూరు చేసిందని టూరిజం అభివద్ధి పేరుతో 1/70 చట్టం సవరణ చేస్తామని,పెసా చట్టం,అటవీ హక్కుల చట్టం ఉల్లంఘిస్తూ ఖనిజా సంపద,సహజ వనరులు అదానీ అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదివాసులకు జీఓ నెంబర్-3 నూరు శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 8 కేబినెట్ సమావేశాలు నిర్వహించారని కనీసం ఆ దిశగా చర్చించలేదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నూరు శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించాలని ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని ఆదివాసీ ప్రాంతాల్లో ఫారెస్టు అనుమతుల పేరుతో వందల రోడ్లు ఆపేశారని ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆగిన రోడ్లు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బురిడీ కొండ, పూజారి సద్దు, కిల్లో సోనబాబు,గొల్లూరి బస్వా గ్రామ యువకులు మోస్య నాగేశ్వరావు, పూజారి దూత్, బలరాం, మాజీ వార్డుసభ్యులు అచ్చమ్మ,మోత్తి,రోహిల, కలిమా, రంభ, ఇరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రావికమతం:మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి పలు రకాల సమస్యలతో బాధపడుతున్న 420 మంది రోగులు హాజరయ్యారు. వీరిలో 35 మందికి పలు రకాల ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించారు. స్టార్ వన్ అధినేత పేకేటి ప్రసాదు, పులగాయల సత్యనారాయణ, గోవిందు బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పలు విభాగాల వైద్య నిపుణులు రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా స్టార్ వన్ ప్రతినిధి పులగాయల గోవిందు బ్రదర్స్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో అనేకమంది పలు రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో గెంజి మోదీ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గంజి వెంకటరమణ, గొంప ఎంపిటిసి గెంజి సూర్యనారాయణ, హై స్కూల్ చైర్మన్ అప్పారావు పాల్గొన్నారు.

రోడ్డుపై పశువులతో పరేషాన్!

- రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు
- తరచూ ప్రమాదాలతో ప్రజల్లో భయాందోళన
- బైక్ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలు
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారిపై తిష్టవేసిన పశువులు

బైక్ ప్రమాదంలో గాయపడిన సత్యనారాయణ

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: రాజవొమ్మంగి వద్ద జాతీయరహదారిపై సంచరిస్తున్న పశువుల గుంపులతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. వచ్చిపోయే వాహనాలు వెళ్లే వీలులేకుండా రోడ్డుపైనే తిష్టవేసి ఉండడం, ఆకస్మాత్తుగా వాహనాలకుఅడ్డంగా రావడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకున్నారు. గడచిన నెల రోజులు వ్యవధిలో పదుల సంఖ్యలో ప్రమాదాలు, వాహనదారులు గాయాల పాలైన ఘటన ఆందోళన రేకెత్తిస్తోంది. తాజాగా శనివారం రాత్రి దోసరపాము గ్రామ శివారు కెనరా అడ్డరోడ్డు వద్ద ప్రధాన రహదారిపై పశువుల వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

కొయ్యూరు మండలం రేవళ్ళ గ్రామానికి చెందిన మాడ సత్యనారాయణ అతని భార్య సోఫా కుమారుడు సాత్విక్ ముగ్గురు బైక్‌పై రాజమండ్రి నుంచి తమ స్వగ్రామం రేవళ్ల వెళ్తుండగా మార్గమధ్యంలో దూసరపాము గ్రామశివారు చంద్ర రింగురోడ్డు సమీపంలో గేదెలు అడ్డు రావడంతో అదుపుతప్పి సత్యనారాయణ కుటుంబం ప్రయాణిస్తు బైక్ ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే క్షతగాత్రులను స్థానిక పిహెచ్‌సికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ రహదారిపై విచ్చలవిడిగా పశువులను వదిలేయడంతో రాత్రి సమయంలో గేదెలను వాహనదారులు గుర్తించక పోవడంతో వాటిని గుద్దుకొని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నా పట్టించుకునే దిక్కులేదు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ స్పందించి, రోడ్డుపై పశువులను వదిలితే, గోశాలలకు తరలిస్తామని, పెంపకందారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా స్పందన లేకపోవడం విశేషం.

రోడ్డుపై పశువులను వదిలితే చర్యలు

దోసరిపాము వద్ద ఘటన నేపథ్యంలో పోలీసులు స్పందించారు. రహదారిపై విచ్చలవిడిగా పశువులను వదిలేస్తే పెంపకందారులపై చర్యలు తీసుకుంటామని స్థానిక సిఐ ఎన్ సన్యాసినాయుడు హెచ్చరిచారు. రోడ్డుపైనే పశువుల సంచారంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, పెంపకందారులు తమ పశువులను ఇళ్ల వద్దశాలల్లో కట్టుకోవాలని సూచించారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు

గిరి గ్రామాల్లో మామిడి పండగ

దబ్బకోట వద్ద బస్సును నిలిపి డబ్బులు వసూలు చేస్తున్న గిరిజన మహిళలు

సీలేరులో ఇళ్లకు వెళ్లి డబ్బులు వసూలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండ, దుప్పిలివాడ, గుమ్మిరేవులు తదితర పంచాయతీల పరిధిలోని మారుమూల గ్రామాల్లో గిరిజనులు మామిడికాయ పండగను ఘనంగా జరుపుకుంటున్నారు. గిరిజనుల ఆచార సంప్రదాయాల ప్రకారం ప్రతి ఏటా ఈ పండగను ఎంతో వైభవంగా జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో ఇటుకల పండుగ పేరుతో జరుపుకునే మామిఇకాయ పండుగ సందర్భంగా తెలుగువారి సంప్రదాయాల ప్రకారం ఉగాది పండుగ రోజు మామిడి పచ్చడి తయారు చేసి బంధుమిత్రులతో ఎంతో ఆనందంగా జరుపుకుంటారు. అదే తరహాలో గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం బంధుమిత్రులకు పిలిచి కోళ్ల మేకలు కోసి సహఫంక్తి భోజనాలు, థింసా వంటి సాంప్రదాయ నృత్యాలతో సందడి చేస్తూ పండగ నిర్వహిస్తారు.

ఈనెల ఎనిమిది నుంచి ప్రారంభించిన 18 వరకు నిర్వహించే మామిడి పండగలో భాగంగా గిరిజనులు రహదారికి అడ్డంగా మామిడి ఆకులు కట్టిన కర్రను గేటుగావేసి, బస్సులు, ఇతర వాహనాలను నిలిపివేసి పాటలు పాడుతూ డబ్బులు వసూలు చేస్తారు. అలా సేకరించిన డబ్బులతో పూజా సామాగ్రి కొనుగోలు చేసి గిరిదేవతలకు పూజారులతో పూజలు నిర్వహిస్తారు. సీలేరు నుంచి లంబసింగి ఘాట్ రోడ్డు దిగే వరకు రోడ్డు పొడవునా గిరిజనుల ఇలా గేట్లు ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేసి పండుగను జరుకుంటారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో గిరిజనులు మామిడికాయ పండుగను సందడిగా నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి మారెమ్మ వార్షికోత్సవం

వార్షికోత్సవానికి సిద్ధమైన మారెమ్మ ఆలయం

ప్రజాశక్తి -సీలేరు: సీలేరులో మారెమ్మ 53వ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. తమిళ సంవత్సరాది రోజున ఏటా ఈ వేడుకలను ఇక్కడ ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

. సీలేరు జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం సమయం లో డ్యాం పనుల కోసం వచ్చిన తమిళులు అప్పట్లో ఈ ఆలయాన్ని తాత్కాలికంగా నిర్మించారు. డ్యాం పనులు ముగిశాక వారి సొంతూళ్లకు వెళ్లిపోగా, కొంతమంది ఇక్కడే ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. అప్పటినుంచి మారెమ్మను తమిళులతోపాటు స్థానికులు కూడా ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారు. కాలక్రమేణా సీలేరు ప్రజల ఇలవేల్పుగా మారమ్మ మారింది. 1964లో చిన్నపాటి రేకుల షెడ్డులో అమ్మవారిని ప్రతిష్టించి కొలిచిన స్థానికులు, తర్వాత భక్తులు సహాయ సహకారాలు విరాళాలు సేకరించి, ఆలయాన్ని నిర్మించారు.

ఈనెల 14న జెండా ఆవిష్కరణతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభిస్తారు 15న అమ్మవారి గరగల అలంకరణ నియమనిష్టలతో నిర్వహిస్తారు. అమ్మవారి గరగల దీక్ష చేపట్టిన వారు శిరస్సుపై పెట్టుకుని అగ్నిగుండం మీదగా ఆలయంలోకి ప్రవేశించి ప్రతిష్టిస్తారు. ఈనెల 26న సీలేరులో అమ్మవారి తిరువీధి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. 27న ప్రధాన పండుగ నిర్వహిస్తారు అదేరోజున భక్తులు ఆలయంలో మొక్కులు తీర్చుకుంటారు. ఈనెల 30న మారుపూజతో మారమ్మ ఉత్సవాలు ముగుస్తాయి.

తుదిమెరుగులు దిద్దుకున్న పుష్కరఘాట్

వార్షికోత్సవాల సందర్భంగా మారెమ్మ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం ఎదురుగా ఉన్న పుష్కర ఘాట్‌కు తుది మెరుగులు దిద్దారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులతోపాటు స్థానికుల బంధువులు కూడా మారెమ్మ వార్షికోత్సవాలకు పెద్దఎత్తున తరలిరానున్నారు.

మన్యంలో భారీ వర్షం

పాడేరులో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ఉండడంతో ప్రజలు అసౌకర్యానికి గురైయ్యారు. తొలుత కారు మబ్బులు కమ్ముకోవడంతో చీకటి వాతావరణం ఏర్పడింది. ఆకాశం పూర్తిగా మేఘావతమై ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని మధ్యాహ్నం రెండు గంటల తర్వాత భారీగా వాన కురిసింది. వర్షం పడడంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. అదష్టవశాత్తు ఉరుములు, మెరుపులు ఈదురు గాలులు పెద్దగా లేదు. మధ్యాహ్నం 2 గంటలకు మొదలైన వాన 4 గంటల వరకు కురుస్తూనే ఉంది. పాడేరు పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పలుచోట్ల డ్రైనేజీలు పొంగి రోడ్లపై భారీగా మురుగునీరు ప్రవహించింది. బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాటు పంట పొలాల్లోని వర్షం నీరు వచ్చి చేరింది. రెండు గంటలకు పైగా ఏకధాటిగా కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

చింతపల్లిలో వడగళ్ల వాన

చింతపల్లి: చింతపల్లిలో ఆదివారం వడగళ్ల వాన కురిసింది. ఈదురు గాలులతో పాటు ఉరుములు మెరుపులతో వడగళ్ల వాన పడటంతో పలు ప్రాంతాల్లో వరద నీరు ఏరులై పారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ ఉరుములు, మెరుపుల కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉష్ణోగ్రతలు మండిపోగా, అనంతరం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురవడంతో రహదారులపై నీరు వరదలై పారింది. ధారకొండ దుప్పిలివాడ గుమ్మరేవులు పంచాయతీ పరిధిలో గ్రామాలతోపాటు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గుంటవాడ తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు జీడి మామిడి పంటలకు, తొలకరి దుక్కులకు లాభిస్తాయని, అదే సమయంలో చింతబొట్టలు తడిసి నష్టం జరుగుతుందని అంటున్నారు. దారకొండ దుప్పిలివాడ వాడ గుమ్మరేవులు పంచాయతీల పరిధిలో వలిసెల పంటకు నష్టం జరుగుతుందని గిరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చింతపల్లిలో కురుస్తున్న వడగళ్ల వాన

ఇంటర్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పెదబయలు: స్థానిక బాలుర రెసిడెన్సియల్ కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 88.77శాతం, జూనియర్ ఇంటర్‌లో 66.29శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆర్ ఈశ్వరమ్మ ఆదివారం తెలిపారు. కళాశాలలో చదువుతున్న పి చిన్న ఎంపిసిలో 923 మార్కులు, చరణ్ బైపిసిలో 918 మార్కులు సాధించిన సాధించారని తెలిపారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

15న సదరం క్యాంప్

ప్రజాశక్తి -అనంతగిరి: వికలాంగులకు ఉచిత కృత్రిమ అవయవ పరికరాలు అందించేందుకు ఈనెల 15వ తేదీన అరకులోయలో ఆర్టిఫిషియల్ లిమ్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ ఆఫ్ కార్పొరేషన్ ఆప్ ఇండియా అలిమ్ కో సహకారంతో ఉచిత మెగా సదరం క్యాంప్ జరుగుతుందని ఎంపిడిఒ ఎవివి.కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని ఉన్న వికలాంగులు ఆధార్, తెల్ల రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్‌తో పాటు హాజరైనట్లయితే అక్కడ ఉనా వైద్యులు వారిని గుర్తించి అర్హులైన వారిని అవసరమైన కత్రిమ అవయవయల పరికరాలను ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు ఈ అవకాశాన్ని సద్వినియోపరుచుకోలేని ఆయన కోరారు

పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో మండల సమావేశం మందిరంలో ఆదివారం ఏపీడబ్ల్యూజేఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం నేత గంట్ల శీనుబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు, ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రచురించినప్పుడే వాటి పరిష్కారం సాధ్యపడుతుందని అన్నారు, టిడిపి జిల్లా కార్యదర్శి కాశీనాయుడు మాట్లాడుతూ, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు దత్తుడు రాజు, డివిజన్ నాయకులు ఈశ్వరరావు, పాత్రికేయులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

రావికమతం: జర్నలిస్టుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా ఏపీయూడబ్ల్యూజే పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జోగి నాయుడు చంద్రరావులు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మాడుగుల ప్రెస్ క్లబ్ సమావేశానికి వీరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు అక్రమంగా ఇచ్చిన జీవో ను తమ సంఘ నాయకులు పోరాడి రద్దు చేయించారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ మంజూరులో గత ప్రభుత్వం విధించిన షరతులు రద్దు చేసి పనిచేసే ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వంతో సంప్రదింపులు చేసామన్నారు. అక్రిడేషన్ మంజూరుకు సవరించిన జీవో త్వరలోనే విడుదల కానుందన్నారు. మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎల్లపు చిన సత్యనారాయణ మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టులకు ప్రత్యేక పింఛను మంజూరు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎస్ రామకోటి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు రోబ్బ శీను, మాడుగుల ప్రెస్ క్లబ్ కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కులో పలు రకాల జింక కూనలు జననం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో వివిధ జాతులకు చెందిన జింకలకు కూనలు జన్మించాయి. ఒక మౌస్ డీర్, రెండు బార్కింగ్ డీర్, మూడు నీల్‌ఘై, ఐదు సాంబార్ డీర్, ఏడు స్పాటెడ్ డీర్, తొమ్మిది బ్లాక్ బక్స్ జన్మించడం చాలా సంతోషంగా ఉందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అంకితభాంతో కూడిన జూ సిబ్బంది కృషి, జంతు సంరక్షణ, సంతానోత్పత్తి కార్యక్రమాల్లో సిబ్బంది నైపుణ్యం ఈ విజయానికి కారణమన్నారు. ప్రస్తుతం ఈ కొత్త కూనలను సురక్షితమైన, సహజమైన ఆవాసాల్లో సంరక్షిస్తున్నట్టు తెలిపారు. జూ సందర్శకులు త్వరలో ఈ అందమైన కొత్త నేస్తాలను చూసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.



విశాఖ జూ పార్కులో సంతానోత్పత్తి వాటి పరిరక్షణ కొనసాగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అంతరించి పోతున్న రేసు కుక్కల పిల్లల జననం, అడవి దున్నకు దూడ ఇటీవల జన్మించడం ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాలలో చోటు చేసుకుంది.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం పండగ

పాడేరులో మట్టలతో ప్రదర్శన చేపడుతున్న క్రైస్తవులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు సిలువకు అప్పగించే ముందు ఆదివారం జెరూసలెంకు ప్రవేశించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ అన్ని చర్చిల్లో ఈ కార్యక్రమం జరిగింది. మట్టల ఆదివారం విశిష్టతను తెలిసేలా పట్టణ, గ్రామాల్లోని వీధుల్లో ఈత మట్టలను చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రం పాడేరు పట్టణంతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల చర్చిల్లో కూడా ఈ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. పాడేరులో ప్రభువైన యేసు క్రీస్తు ప్రార్థన మందిరం సభ్యులు మట్టలను చేతపట్టి పట్టణ పురవీధుల్లో క్రీస్తు గీతాలాపనలు, ప్రార్థనలు చేస్తూ ప్రదర్శన చేశారు. పాస్టర్లు సి హెచ్.దైవకృప, జి.తిమోతి, పి.జాన్ ఫ్రెడ్రిక్, ఎం.బాబురావు, బుచ్చయ్య, వైవై రత్నం, ఎం.డానియల్, జాషువా, వి.మత్స్యరాజు, ప్రేమ్ కుమార్, యోబు, ఎస్.అబ్రాహాము, పి.డేవిడ్, లూకా, ఇశ్రాయేలురాజు, జాన్ డేవిడ్, ఎజ్రా, తదితరులు చర్చిల్లో మట్టల ఆదివారం ప్రత్యేక సందేశం వినిపించారు.

సీలేరు: సీలేరులో క్రైస్తవులు మట్టల ఆదివారం పండగ ఘనంగా నిర్వహించారు. ఈత కొమ్మలకు పూలను గుచ్చి వాటిని పట్టుకొని హోసన్న అంటూ పిల్లలు, పెద్దలు గీతాలు ఆలాపిస్తూ స్థానిక యూసిఐఎం చర్చికి చేరుకున్నారు. అనంతరం పాస్టర్ మనసై ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఏటా ఆనవాయితీగా గుడ్‌ఫ్రైడే ముందు వచ్చే ఆదివారం నిర్వహించే ఈస్టర్ సండే సందర్భంగా మట్టల పండుగను జరుపుకుంటున్నారు. ఏసుక్రీస్తు వేషధారణలో చిన్నారులు అలరించారు.

సీలేరులో చేస్తున్న ప్రార్థనలు

ప్రత్యేక గిరిజన భూ దర్బార్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కొత్తకోట: మైదాన ప్రాంత గిరిజనుల సమస్యలపై నర్సీపట్నం కేంద్రంగా ప్రత్యేక గిరిజన భూ దర్బార్ ను ఏర్పాటు చేయాలని 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవింద రావు, గిరిజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. గిరిజన సంఘం, 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రావికమతం మండలం జెడ్.బెన్నవరం నుంచి అజేయపురం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. కల్యాణపులోవలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలంటినీ 5వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. రాజ్యాంగంలో ఆదివాసీ గిరిజనులకు రక్షణ కోసం అనేక చట్టాలను రూపొందించారని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల్లో గిరిజనుల సాగులో ఉన్న భూముల నుంచి రెవెన్యూ అధికారుల సహకారంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెళ్లగొడుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం నర్సీపట్నంలో ప్రత్యేక భూ దర్బార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవీటీజీ గిరిజన సంఘం నాయకులు గెమిల వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ కటాఫ్ తేదీని సవరించాలి

ప్రజాశక్తి- కూనవరం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కుటుంబాలలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఆర్అండ్ఆర్ పరిహారం ఇచ్చేందుకు కటాఫ్ తేదీని ఎప్పుడు పరిహారం ఇస్తారో ఈ తేదీగా సవరించాలని సిపిఐ డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహనావు డిమాండ్ చేశారు . పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం కటాఫ్ తేదీని 2022 అక్టోబర్ 10గా నిర్ణయించిందని, కానీ మూడేళ్లు గడిచినా ఇప్పటికీ ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. ప్యాకేజీ ఇచ్చిన నాటికి 18ఏళ్లు నిండినవారెందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. అలాగే నిర్వాసిత కుటుంబాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. . పోలవరం పరిహారాన్ని వాయిదా వేస్తూ నిర్వాసితుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ప్రభుత్వాలు ఇకనైనా చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ముంపుబారిన పడే అన్ని గ్రామాలకు మొదటిఫేజ్‌లోనే పరిహారం అందేలా గ్రామసభలనునిర్వహించాలని, వచ్చే వరదలోగాఅన్నీ క్లియర్ చేయాలని కోరారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

భూమాత ఆధ్వర్యాన ఎస్ఎన్ స్వప్నలోక్ గ్రాండ్ కస్టమర్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భూమాత గ్రూప్, ఎస్‌విఎన్ గ్రూప్ సంయుక్తంగా విజయనగరం జిల్లాలో తాటిపూడి వద్ద సుమారు 200 ఎకరాలలో 5 ఫేజ్‌ల్లో 1650 ప్లాట్స్‌ను విఎంఆర్‌డిఎ అనుమతులతో అందరికీ అందుబాటు ధరలతో ముందుకు తెచ్చిన నేపథ్యంలో ప్రతిష్టాత్మకమైన ఆ నూతన వెంచర్ 'ఎస్ఎన్ స్వప్నలోక్' వద్ద ఆదివారం గ్రాండ్ కస్టమర్ మేళా ఏర్పాటు చేశారు. దీనికి స్పందన వచ్చింది. సుమారు 3 వేల మందికిపైగా కస్టమర్లు పాల్గొన్నారని, 400 ప్లాట్లు అమ్ముడయ్యాయని భూమాత మేనేజింగ్ డైరెక్టర్ తాళ్ళూరి పూర్ణచంద్రరావు, ఎస్‌విఎన్ గ్రూప్ ఛైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ వెంచర్‌లో ఇంతవరకు రియల్ ఎస్టేట్ చరిత్రలో ఎవ్వరూ ఇవ్వని సౌకర్యాలు ఉన్నాయన్నారు. క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ సదుపాయాలు ఉన్నట్టు తెలిపారు. విశ్రాంతి, వినోదం ఇచ్చే ఒక థీమ్డ్ ప్రీమియం రెసిడెన్షియల్ మెగా ప్రాజెక్ట్‌గా దీనిని రూపొందించామన్నారు. ఈ వెంచర్‌లో ప్రతిష్టాత్మకంగా ప్రపంచంలో 7 వండర్స్ తాలూకా కళాకృతులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ తాళ్ళూరి శివాజీ, కిరణ్ శంకర్, గోపాల్, మార్కెటింగ్ సభ్యులు పాల్గొన్నారు.

86 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - కూనవరం: మండలంలోని రేగులపాడు గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కుంజా రాము, ప్రోగ్రాం మేనేజర్ మడకం శివ ఆధ్వర్యంలో ఉస్మానియా యునివర్సిటి కంటి వైద్యులు డాక్టర్ లక్ష్మీప్రియ, డాక్టర్ .గంగాధర రావు ఆధ్వర్యంలో 86 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, కళ్ళద్దాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ రామారావు, పీసా కమిటి అధ్యక్షులు రాజు, కార్యదర్శి బాబూరావు, గ్రామస్తులు ముత్తయ్య, రాఘవయ్య, ఆశా కార్యకర్తలు రమణ, శారద పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో రెండు పూటలా సూపర్ స్పెషాలిటీ సేవలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కెజిహెచ్‌లో రెండు పూటలా సూపర్ స్పెషాలిటీ విభాగాల సేవలు ప్రారంభమయ్యాయని, వాటిని వినియోగించుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఆదివారం కెజిహెచ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఎటువంటి మందుల కొరతా లేదన్నారు. కార్డియాలజీ, న్యూరోసర్జరీ, యురాలజీ, పెడియాట్రిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, సిటివిఎస్, ఎండోక్రైనాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, న్యూరాలజీ, ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగాలు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు. ఉదయం పూట రక్త పరీక్షలు, స్కానింగ్‌లు, ఎక్స్‌రేలు తీసుకునే రోగులు మధ్యాహ్నం వైద్యులకు వాటిని చూపించి ప్రిస్క్రిప్షన్ రాయించుకొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని విభాగాలనూ కంప్యూటరీకరణ చేస్తున్నామని, ఇకపై ప్రతి రోగి వివరాలు కంప్యూటర్‌లో నమోదవుతాయని తెలిపారు.

ఉత్తేజపూరితం.. రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం

ప్రస్తుత పాలకుల విధానాలతో ప్రజలకు తీవ్ర నష్టం : సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటాలు : సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని కెవిపిఎస్, ప్రజానాట్య మండలి సంయుక్తాధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం తలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం అందరిలో ఉత్తేజం నింపింది. తొలుత వందలాది మంది కళాకారులతో నిర్వహించిన కళారూపాల శంఖారావం ఆకట్టుకుంది. ఎల్ఐసి కార్యాలయ దరి అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన శంఖారావం ర్యాలీని సినీనటుడు, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. డప్పుల వాయిద్యాలు, మహిళల కోలాటం, తీన్మార్‌తో ఈ ప్రదర్శన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, బాటా జంక్షన్ మీదుగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రానికి చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన సమ్మేళన సభలో ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో భారత రాజ్యాంగానికి విరుద్ధంగా పనిచేస్తున్న పాలకులు ఉన్నారని, వారి విధానాల వల్ల తీవ్ర నష్టం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్ముందు ఇది మరింత తీవ్రం కానుందన్నారు. ఈ పరిస్థితులలో దేశ ప్రజల అందరి క్షేమం కోరే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రశ్నించేవారిపై దాడులకు పాల్పడుతోందని తెలిపారు. కార్మిక చట్టాలను ఇష్టానుసారం మార్చేస్తోందన్నారు. నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోందని తెలిపారు. మోడీ పాలనలో భారత రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందన్నారు. రాజ్యాంగం ఉంటేనే ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చెప్పిన విధంగా ప్రజలను సమీకరించడం, బోధించడం, పోరాడటం చేయవలసిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగాన్ని మనువాదుల చేతుల్లో పెట్టేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దేశంలో నేడు వంద కోట్ల మందికి కొనుగోలు శక్తి లేకుండా పోయిందన్నారు. భారతదేశాన్ని హిందూ రాజ్యాంగా మార్చే కుట్ర జరుగుతోందన్నారు. ఈ క్రమంలోనే ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు అందులో భాగమేనన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ అంబేద్కర్, హిమ్మి, ఫూలే, జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు ఉండాలన్నారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ దేశ ప్రజలపై మతోన్మాదాన్ని బిజెపి ప్రేరేపిస్తోందన్నారు. సభ ప్రారంభంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి రాజ్యాంగ పీఠిక చదివి సభలో పాల్గొన్న వారందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో కెవిపిఎస్ చేపట్టిన పోరాటాలను తెలియజేశారు. ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు జి.రమణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి టి.చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, ఉపాధ్యక్షులు వై.రాజు, కె.సత్యనారాయణ, జి.స్టాలిన్, ఎంవి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళారూపాల ప్రదర్శన జరిగింది. థింసా నృత్యం, రాజ్యాంగ పరిరక్షణ నాటిక, బాల బాలికల నృత్య ప్రదర్శనలు, మహిళా కోలాటాలు, బృంద, దేశభక్తి గేయాల ఆలాపన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళా ప్రదర్శనలో అంబేద్కర్ వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులందరికీ ఆర్.నారాయణమూర్తి, కె.లోకనాథం, ఆండ్ర మాల్యాద్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, వేదికపై ఆర్.నారాయణమూర్తి

నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

దబ్బగూడెంలో మాట్లాడుతున్న సిఐ దుర్గాప్రసాద్

చదువుకుంటే చక్కని ఉపాధి

ప్రజాశక్తి - మోతుగూడెం : గిరిజన యువత చక్కగా చదువుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని చింతూరు సీఐ దుర్గా ప్రసాద్, డొంకరాయి ఎస్ఐ శివకుమార్ అన్నారు. ఆదివారం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న దబ్బగూడెం గ్రామం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ సిబ్బంది పర్యటించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో యువత ఆర్థిక సమస్యలతో మధ్యలోనే చదువును మానేయడం సరికాదన్నారు. గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వాలు హాస్టళ్లను ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలను ఏర్పాటు చేసి ఎటువంటి ఖర్చు లేకుండా చదివిస్తుందన్నారు. గిరిజన విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో ఉన్న రిజర్వేషన్ సద్వినియోగం చేసుకుంటే ప్రభుత్వ కొలువులును కూడా అందిపుచ్చుకోవచ్చన్నారు. జల్సాల కోసం, కష్టపడకుండా వచ్చే డబ్బు కోసం గంజాయి వంటి చెడు మార్గాల వైపు వెళ్లకూడదని, గంజాయి కేసులో ఇరుక్కుంటే భవిష్యత్ అంధకారమౌతున్నారు. ప్రభుత్వ పథకాలు దూరమౌతాయని, గంజాయి ద్వారా సంపాదించే ఆస్థులు కూడా ప్రభుత్వం జప్తు చేస్తుందన్నారు. గ్రామాల్లోకి మావోయిస్టులు, ఇతర అసాంఘిక శక్తులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలన్నారు. సమాచారమిచ్చిన వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు ప్రభుత్వపరంగా బహుమతి ఇస్తామన్నారు.

అ'పూర్వ' కలయిక

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-89 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. రంపచోడవరం మండలం తాళ్లపాలెం గ్రామ సమీపంలోని పుష్ప షూటింగ్ స్పాట్ వద్ద ఆత్మీయ సమావేశమైన వీరంతా పరస్పర పరామర్శలు, ఆలింగనాలు, పూర్వ స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకుని సందడిగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతరత్రా వ్యాపకాల్లో స్థిరపడిన వారంతా 36 ఏళ్ల తరువాత ఇలా కలుసుకోవడం చాలా అనందాన్ని కలిగించిందని, కుటుంబ సభ్యులతో కలసి పాత మిత్రులను కలుసుకోవడం కంటే సంతోషం ఇంకేముంటుందని అభిప్రాయపడ్డారు. తోటి స్నేహితుల్లో ఆర్థికంగా వెనుకబాటు, ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయం చేయాలని నిర్ణయించి, కొందరికి సాయం అందజేశారు. ఇక నుంచి ఒక కుటుంబంగా కలిసిమెలిసి ఉందామని, తరచూ ఇలా కలుసుకోవాలని నిర్ణయించుకున్న మిత్రబృందం బరువైన హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు.

300 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం మండలం సిరిగిందలపాడులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆదివారం మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. 300మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో 82 మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, నలుగురికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజీ తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 60మందికి కంటి పరీక్షలు చేసివారిలో 15మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి కళ్లద్దాలు అందజేశారు. 17మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేసి, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయానిక తరలించారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని, స్వామీజీ కోరారు. వైద్య శిబిరంలో డాక్టర్ తలారి సుబ్బరావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ దాసరి ఉమామహేష్. పాల్గొని ఆరోగ్యసేవలు అందించారు. క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, దాసరి పెద్ద అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు, రోగులు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించినట్లు స్వామీజీ తెలిపారు .

వక్ఫ్ సవరణలపై విశాఖలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వక్ఫ్ చట్ట సవరణలను ఖండిస్తూ విశాఖ నగరంలో ఆదివారం ముస్లిములు భారీ ర్యాలీ నిర్వహించారు. డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం జంక్షన్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం మత పెద్దలు, నాయకులు మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదం తెలిపిన వక్ఫ్ సవరణ బిల్లులో లోపాలున్నాయన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు దీన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ర్యాలీలో సుప్రీంకోర్టు న్యాయవాది ఎంజిఎం.ఖాన్, ముస్లిం పెద్దలు డాక్టర్ జహిర్ అహమ్మద్, ఐహెచ్.ఫరూకి, రహమతుల్లా బేగ్, ఎస్‌కె.మునీర్, ఆల్ మాస్క్ అధ్యక్షులు హాజీ అహమదుల్ల ఖాన్, దేవరకొండ మార్కండేయులు (మొహమ్మద్ ఇబ్రహీం), షరీఫ్, ఎస్‌కె.మునీర్, మగబుల్, హాజీ మీర్ అబ్బాస్ హుస్సేన్ పాల్గొన్నారు